క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మాడ్గుల: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్ సునీల్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, నీటి సౌకర్యాలను ఏర్పాటు చేయించారు. మాడ్గుల మండల వ్యాప్తంగా 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు.

24వ వార్డులో జోరుగా ప్రచారం

తుర్కయంజాల్: పోలింగ్‌కు కేవలం కొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉండటంతో పురపాలక సంఘం పరిధిలోని 24వ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఇప్పటికే ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించడంతో పాటు, సభలు, సమావేశాలు, రోడ్‌షోలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ప్రచారం చివరి అంకానికి చేరుకోవడంతో పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని కోరుతూ ప్రచారం చేశారు.

'అవినీతి ఊబిలో బీజేపీ ప్రభుత్వం'

తుర్కయంజాల్: పదేళ్ల బీజేపీ పాలనలో అవినీతి, అక్రమాలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒరుగంటి యాదయ్య ఆరోపించారు. శుక్రవారం తుర్కయంజాల్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రచురించిన 'అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ ప్రభుత్వం' అనే పుస్తక ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చడంతో పాటు, సమాచార హక్కు చట్టంలో లేని అనేక నిబంధనలను మార్చారన్నారు. కార్పొరేట్ శక్తులకు రూ. 16వేల కోట్ల రుణమాఫీ, లోక్‌పాల్, లోకాయుక్త, చట్టాలను పట్టించుకోకపోవడం, అమిత్ షా కుమారుడు జైషా ఆస్తులు రెట్టింపవ్వడం, ఎలక్ట్రోరల్ బాండ్ల పేరుతో పెద్ద ఎత్తున విరాళాలను సేకరించిందని విమర్శించారు. విజయ్ మాల్యా, నీరవ్ మోది వంటి వారిని దేశం దాటించిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి శివ కుమార్, కాటం రాజు, చెక్క యాదగిరి, ఆనంద్, మల్లేశ్, రవి, దీప్లా నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్
- మల్లు రవికి మద్దతుగా ప్రచారం

కడ్తాల్: కాంగ్రెస్ తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు పల్లెచెలక, మక్తమాదారం, మైసిగండి గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు అందించి, అధికారంలో రాగానే చేపట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా, పాల్గొన్నారు.

ఆమనగల్లు: కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం సాధ్యమని మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ దనుంజయ, కాలె మల్లయ్య, మల్లేశ్, పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా అభివృద్ధి: మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

కులమతాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతుందని మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్ పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వివిధ మసీదుల వద్ద శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా చిత్తరంజన్‌దాస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముస్లింలందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. మసీదు కమిటీల అధ్యక్షులు మాసూం, గౌస్, ఖాదర్‌ఖాద్రి, వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, జగన్, మానయ్య, అలీం, నాజర్, కృష్ణనాయక్, ఖాదర్, కుమార్‌గౌడ్, మహేశ్, వెంకటేశ్, రవీందర్, పాల్గొన్నారు.



ఆమనగల్లులో ముస్లింలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

తలకొండపల్లి: కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్న మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం ఆమన్‌గల్ ఏరియా కమిటీ కన్వీనర్ కానుగుల వెంకటయ్య పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని గెలిపించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాల పరిపాలన కాలంలో దేశ ప్రజలను, రైతులను మోసగించి, మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు జిమ్మిక్కులు, కుయుక్తులు చేస్తోందని ఆరోపించారు.

'ఉపాధి'లో అక్రమాలు, అవకతవకలు!

యాచారం: మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం జరిగింది. 24 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు దాదాపు రూ. నాలుగున్నర కోట్లకు పైగా పనులు జరిగాయి. దీనికి సోషల్ ఆడిట్ అధికారులు ప్రతీ గ్రామంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో వెలుగులోకి వచ్చిన నిధుల దుర్వినియోగం, కూలీల ఇబ్బందులు, రైతులకు సమాచారం లోపం తదితర సమస్యలపై శుక్రవారం మండల సామాజిక తనిఖీ ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందం వివరాలు వెల్లడించారు. అడిషనల్ డీఆర్డీఓ సుభాషిణి, క్వాలిటీ కంట్రోల్ అధికారి పద్మావతి, అంబుడ్స్‌మెన్ సునీతా, విజిలెన్స్ అధికారి కొండయ్యతో పాటు యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కూలీలకు పే స్లిప్పులు సకాలంలో ఇవ్వకపోవడం,



సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆడిట్ సిబ్బంది

ఎంబీ రికార్డుల్లో నమోదు చేయకుండానే నిధులు మంజూరు చేయడం, రైతులకు సమాచారం ఇయ్యకుండానే వారి వ్యవసాయ భూముల్లో భూ అభివృద్ధి, వరద కట్టల నిర్మాణ పనులు చేపట్టడం, సంరక్షణ లోపం వల్ల ఆయా గ్రామాల్లో వందలాది మొక్కలు ఎండిపోవడం వంటి వివరాలను వెల్లడించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రూ. లక్షలాది నిధులు దుర్వినియోగమైనట్లు వారు పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

పోల్కంపల్లిలో బీఆర్ఎస్ ప్రచారం

ఇబ్రహీంపట్నం రూరల్: భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బడుగు, బలహీన వర్గాల నేత క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పోల్కంపల్లి ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం పోల్కంపల్లి గ్రామంలో క్యామ మల్లేష్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సావిత్రి, నర్సింహా, చెరుకూరి రవీందర్, దానయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మేడిబాయి రవి, మొద్దు బాల్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, కృష్ణ, రాజు, కుమార్, దౌలత్‌లు పాల్గొన్నారు.

'ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపిద్దాం'



తలకొండపల్లి: దేవుని పడకల్‌లో ప్రచారం

కడ్తాల్: పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపించుకుందామని మండల అధ్యక్షుడు మాన్యనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.

తలకొండపల్లి: పోతుగంటి భరత్ ప్రసాద్ ప్రజల మనిషి అని ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా మండల అధ్యక్షుడు రవిగౌడ్ దేవుని పడకల్‌లో ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలు పనిచేసే ప్రదేశానికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమానికి కుమార్ హాజరై మాట్లాడారు. భరత్ ప్రసాద్‌ను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తాడని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి భరత్‌ను గెలిపించాలని కుమార్ ప్రజలను అభ్యర్థించారు.

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తండా, ఎర్రబిక్య తండా, నుచ్చుగుట్ట తండా, వేములకుంట తండా, బర్రోనిబావి తండాలో ఇంటింటి ప్రచారం చేశారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

కడ్తాల్: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చరికొండ, ముద్విన్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్‌లతో కలిసి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి బీఆర్ఎస్‌కు ఓటేయాలని అభ్యర్థించారు. సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్‌లు ఎల్ఎన్‌రెడ్డి, నర్సింహాగౌడ్, పాల్గొన్నారు.

తలకొండపల్లి: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించుకుందామని సీనియర్ నేత, మాజీ ఎంపీపీ, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. అభివృద్ధి నిరోధక పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలను లోక్‌సభ ఎన్నికల్లో తరిమి కొట్టాలని పిలుపు నిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చుతుందని, రిజర్వేషన్లు రద్దవుతాయని, మాయ మాటలతో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయొద్దన్నారు. వెల్జాల్‌లో శ్రీనివాసుయాదవ్ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలు పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లి ప్రచారం చేశారు.



కడ్తాల్: ప్రచారం నిర్వహిస్తున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: మంగళికుంట, కొత్తకుంట తండాలలో శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా దోనాదుల కుమార్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దోనాదుల కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందకపోగా కష్టాలు మొదలయ్యాయని అన్నారు. 6వ వార్డులో పత్యానాయక్, వడ్డె వెంకటేశ్, కొమ్ము ప్రసాద్, గణేశ్, శివ తదితరులు ప్రచారం నిర్వహించారు. వెంకటయ్య, లాలయ్య, జాన్యానాయక్, దశరథం పాల్గొన్నారు.

బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించండి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: భువనగిరి ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ గెలిస్తేనే అభివృద్ధి పనులకు అత్యధిక నిధులు మంజూరవుతాయని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరుతూ శుక్రవారం చౌదర్‌పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. ఓటు వేయమని అభ్యర్థించారు. రానున్న కాలంలో ఉపాధి పనులు కొనసాగాలంటే కమలం పువ్వు గుర్తుపై ఓటేసి మూడోసారి నరేంద్రమోడీని ప్రధానిని చేయాలని కూలీలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో జరిగే సీసీ రోడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు తదితర అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులు వస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీధర్‌గౌడ్, నుడుకుడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్‌ని గెలిపించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తుందన్నారు. కర్కల్‌పహాడ్ మాజీ సర్పంచ్ నాగమణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకోబా, గ్రామకమిటీ అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ తుమ్మలూరి శ్రీను, మాజీ వార్డు సభ్యులు పార్టీలో చేరారు.



కడ్తాల్: ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్‌తో పాటు, వివిధ పార్టీల నాయకులు